యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- దర్జాగా తెలంగాణకు తరలిస్తున్న వైనం..
- చెక్‌పోస్టులు ఉన్నా ప్రయోజనం సున్నా
- ఇసుకదందాకు సహకరిస్తున్న పేట పోలీసులు
- గుర్తించిన సీసీఎస్ సిబ్బంది

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు: నియోజకవర్గంలో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారపార్టీ నాయకులు ముందుగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తోటలు, ఖాళీ స్థలాల్లో డంప్ చేసి అనంతరం రాత్రుళ్లు లారీల ద్వారా తెలంగాణకు తరలిస్తున్నారు. చెక్‌పోస్టులు ఉన్నా ప్రయోజనం సున్నా అన్నట్లుగా పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారుల ఉదాసీన వైఖరి...

పోలీస్, రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగానే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రుళ్లు లారీల్లో హైదరాబాద్‌కు పెద్దఎత్తున ఇసుక అక్రమరవాణా సాగుతున్నప్పటికీ పోలీస్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు.

కోదాడలో మూడులారీలు స్వాధీనం..

ఆంధ్రా ప్రాంతం వెళ్తున్న మూడు ఇసుక లారీలను రెండురోజుల కిందట తెలంగాణ రాష్ట్రం కోదాడ వద్ద పోలీసులు పట్టుకున్నారు. రాత్రి సమయంలో ఇసుక లారీలు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం దొండపాడు మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుకుని అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా దర్జాగా హైదరాబాద్‌కు వెళ్తున్నాయి.

భారీగా ఇసుక నిల్వలు..

ఉచిత ఇసుక విధానం కూటమి నేతలకు కాసులు కురిపిస్తోంది. కొందరు నాయకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. రానున్న వర్షాకాలంలో పెద్దఎత్తున ఇసుక వ్యాపారం సాగించేందుకే భారీఎత్తున ఇసుకను ఖాళీ స్థలాలు, వెంచర్లు, తోటల్లో డంప్ చేస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక అక్రమ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగేందుకు ముందస్తుగా పక్కాప్రణాళికతో వ్యవహరిస్తుండటం గమనార్హం. అందులో భాగంగా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఇలా ఇసుక నిల్వలు చేస్తున్నారు.


పెనుగంచిప్రోలులోని ఓ వెంచర్‌లో భారీగా డంప్ చేసిన ఇసుక


అన్నవరంలో డంప్ చేసిన ఇసుక


ఇటీవల తెలంగాణ రాష్ట్రం కోదాడలో పట్టుబడిన ఇసుక లారీలు(ఫైల్)

పోలీసులు పాత్రధారులే..

ఈఅక్రమ ఇసుకదందాకు జగ్గయ్యపేట పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు ఇప్పటికే సీసీఎస్ పోలీసులు గుర్తించినట్లు సమాచారం. గతేడాది మునేరు, పాలేరుకు వచ్చిన వరదలకు ఏర్పడిన ఇసుక మేటలు కూడా ఇసుక అక్రమ రవాణాదారులకు కాసులు కురిపిస్తున్నాయి. ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను పగలు, రాత్రి తేడా లేకుండా తెలంగాణకు తరలిస్తున్నారు. ముఖ్యంగా అన్నవరం, బలుసుపాడు, తక్కెళ్లపాడు నుంచి పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఇసుక తరలివెళ్తోంది. మల్కాపురంలో మునేరు రీచ్ నుంచి కూడా ఇసుక తరలి పోతోంది. చెక్‌పోస్ట్‌లు ఉన్నా ఇసుక మాత్రం నిత్యం లారీలు, ట్రాక్టర్లలో తరలి పోతుండటం గమనార్హం. కొన్నిసార్లు పోలీసు సిబ్బందే ఇసుక అక్రమ తరలింపు వాహనాలను సరిహద్దు దాటిస్తున్నారే విమర్శలు కూడా వినిపిస్తుండటం గమనార్హం. గతంలో ముక్త్యాల చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఓ కానిస్టేబుల్ స్వయంగా ఇసుక ట్రాక్టర్‌ను నడిపి రాష్ట్ర సరిహద్దు దాటించిన వైనం వెలుగుచూడటంతో అతన్ని ఆ విధుల నుంచి తప్పించిన ఘటనే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

అడ్డుకునే వారేరీ?..


వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు నుంచి లారీల్లో తరలివెళ్తున్న ఇసుక

వత్సవాయి మండలం ఇందుగుపల్లి, ఆళ్లూరుపాడు, పోలంపల్లి వద్ద మునేరు నుంచి ఇసుక అక్రమంగా తెలంగాణకు తరలి పోతోంది. ఇందుగుపల్లి వద్ద మునేరు రీచ్‌లో రోజుకు 2 నుంచి 3 టిప్పర్ల ఇసుక అర్ధరాత్రి తెలంగాణకు తరలిస్తున్నారు. టిప్పర్లకు జేసీబీ ద్వారా ఇసుక లోడింగ్ చేస్తున్నారు. మూడునెలల కిందట ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్లను జగ్గయ్యపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు అడ్డుకోవడంతో కొద్ది రోజులపాటు ఆగిన ఈ ఇసుక అక్రమరవాణా మళ్లీ యథావిధిగా సాగుతూనే ఉంది. ఆళ్లూరుపాడు, పోలంపల్లి వద్ద నుంచి కూడా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తెలంగాణకు యథేచ్ఛగా తరలి పోతోంది. ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు, పాలకులే ఈ అక్రమ వ్యవహారంలో భాగస్వాములుగా ఉండటమే జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగటానికి ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ తీరుతో చేనేతల పరిస్థితి అగమ్యగోచరం

పెంటి శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో చేనేత వృత్తిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించని కారణంగా నేతన్నలకు ఆకలి కేకలు తప్పడం లేదన్నారు. చేనేత సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రిబేటు రూ.156 కోట్లు, థ్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీలు అందని కారణంగా చేనేతలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి చేనేత రంగానికి చేయూతనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

వృథాగా పోతున్న తాగునీరు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ పరిధిలో పలుప్రాంతాల్లోని తాగునీటి ప్రధాన పైపులైన్లు లీకేజీలు అవుతుండటంతో తాగునీరు వృథాగా పోతుంది. ముఖ్యంగా కోదాడ రోడ్‌లోని ఎస్‌బీఐ సమీపంలోని ప్రధాన పైపులైన్ లీకవడంతో ప్రధానరహదారిపై అంతా నీటిమయమైంది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మున్సిపల్ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఈ విధంగానే లీకేజీలు ఏర్పడి ఎంతో విలువైన తాగునీరు వృథాగా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే స్పందించి పట్టణంలో లీకేజీలను మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


లీకేజీ కారణంగా వృథాగా పోతున్న నీరు


పెద్దాపురం గ్రామ సమీపంలో పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి

గోతులమయమైన పెద్దాపురం రోడ్డు

వీరులపాడు: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని పెద్దాపురం నుంచి తెలంగాణలోని ఎర్రుపాలెం వెళ్లే రహదారి పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. రెండు రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్దాపురం గ్రామ సమీపంలో రహదారిపై మోకాళ్లలోతు గుంతలు ఏర్పడటంతో వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీకావు. వర్షాలు పడిన సమయంలో గుంతల్లోకి నీరు చేరి గుంతలున్న విషయం కూడా తెలియక పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. రాత్రి సమయాలలో గుంతలు కనిపించక, అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి గుంతలను పూడ్చించే విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.


ఆలయం లోపల బేడా మండపం వద్ద భక్తుల సందడి


క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


మల్లెపూల అలంకరణలో శ్రీతిరుపతమ్మవారు

అమ్మవారి దర్శనానికి

పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారు మల్లెపూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసి పోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.


ఆలయం బయట భక్తుల రద్దీ

ఐక్య ఉద్యమానికి కార్యాచరణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శాతవాహన కళాశాలకు చెందిన భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే కళాశాలను నిర్వహించాలని శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ వీ.సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆ కళాశాల పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ అధ్యాపకుల సమావేశం (గెట్ టూ గెదర్) విశాలాంధ్ర పత్రిక కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగింది. వి.సాంబిరెడ్డి మాట్లాడుతూ కోర్టు తీర్పు పేరుతో కళాశాల భవనాలను కూల్చివేసిన వారే భవనాలను నిర్మించాలన్నారు. కళాశాల సమస్య పరిష్కారం కోసం అవసరమైతే పరిరక్షణ కమిటీ తరఫున కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేసైనా కళాశాలను రక్షించుకోవాలన్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు అందజేయడంతో పాటుగా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.


శాతవాహనా కళాశాల పరిరక్షణ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు

చట్టపరంగా చర్యలు తీసుకోవాలి..

కమిటీ కో-కన్వీనర్ డీ.విష్ణువర్ధన్ మాట్లాడుతూ రాత్రి వేళ భవనాలను కూల్చి వేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ కో-కన్వీనర్స్ ఎం.అరుణ్‌కుమార్, ఎస్.సాంబశివరావు, పూర్వ విద్యార్థులు బైపూడి నాగేశ్వరరావు, సైనుద్దీన్, శ్రీనివాసరావు, కిరణ్, విద్యార్థి సంఘాల నాయకులు రవిచంద్ర, రాజేష్, షణ్ముఖ్‌తో పాటుగా రిటైర్డ్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ అని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ కళాశాలలో ఆదివారం శ్రీశ్రీ 42 వర్ధంతి సభ, తమ్మారెడ్డి భరద్వాజకు మహాకవి శ్రీశ్రీ స్మారక పురస్కార సభను ఆదివారం నిర్వహించారు. పురస్కారం అందుకున్న భరద్వాజ మాట్లాడుతూ తెలుగు సినిమాపాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి శ్రీశ్రీ అన్నారు. ప్రబోధాత్మక గీతాలైన, కరుణ రసాత్మకమైన గీతాలైన, విషాద గీతాలైన అద్భుతంగా రాయగల నేర్పు శ్రీశ్రీ దన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ కవిత్వం ఎందరో యువ కవలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు పాటకు సాహిత్య విలువలను అందిచిన కవి శ్రీశ్రీ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి సంస్థ లక్ష్యాలను వివరించారు. డెప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి, సింగంపల్లి అశోక్‌కుమార్, రావి కృష్ణారావు, రామలింగరాజు పాల్గొన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, సభ్యులు సీహెచ్‌వీ సుబ్బయ్య, రవి కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఎంపీడీవో బీఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

వీరులపాడు: మండలంలోని చట్టన్నవరం గ్రామంలో ఈనెల 17వతేదీ మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చలమల దుర్గారావు తెలిపారు. విజయవాడకు చెందిన పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులతోపాటు అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

వైద్యశిబిరం నిర్వహణ



నందిగామ రూరల్: స్వచ్ఛంద సంస్థలు, సేవాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్మ హాస్టల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పెద్దకాకానికి చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమ్మ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వాహనదారులు తమ ప్రయాణ సమయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సూచించారు. గ్రామంలోని ప్రధాన సెంటరులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. ఆటోలలో పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించాలన్నారు. లౌడ్ స్పీకర్లు పెట్టినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థికి సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: ఆలిండియా మెడికల్ ఎంట్రన్స్(నీట్) యూజీ పరీక్షా ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన విద్యార్థి వడ్డేపల్లి యజ్ఞేశ్వర్ 590/720 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 2,168వ ర్యాంకు సాధించాడు.ఈసందర్భంగా యజ్ఞేశ్వర్‌ను తాత్వికులు గెంటేల వెంకట రమణ దంపతులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దంపతులు అభినందించి సత్కరించారు. యజ్ఞేశ్వర్ తండ్రి శ్రీనివాసరావు శ్రీలక్ష్మ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం వత్సవాయి మండలం వేమవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హరికృష్ణ, లత దంపతులు రూ.17,116లు విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం గ్రామానికి చెందిన మదమంచి వేణుబాబు, శ్రీవల్లి దంపతులు రూ.10,116, సికింద్రాబాద్‌కు చెందిన తన్నీరు నరసింహ, వరమ్మ దంపతులు రూ.5,051 విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మణ్, ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'తంగిరాల' విగ్రహావిష్కరణ



నందిగామటౌన్: దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు నిస్వార్థ ప్రజానాయకునిగా పనిచేశారని కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. తంగిరాల ప్రభాకరరావు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రైతుపేటలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిగా, శాసనసభ్యునిగా ప్రభాకరరావు మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లాల్‌బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జగ్గయ్యపేట అర్బన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరప్రవృత్తిని విడనాడి సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఇప్పటికైనా మారకుంటే పట్టణం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ జి.రాజు, చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరునికి లక్ష మల్లెల పూజ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా చౌడవరపు వంశీకుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత స్నపనం, లక్ష మల్లెపూల అర్చన, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం తదితర పూజాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సచివాలయ భవనానికి మరమ్మతులెప్పుడో?



బూదవాడ(జగ్గయ్యపేట): గతేదాది సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదలకు దెబ్బతిన్న జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామసచివాలయానికి పాలకులు నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. గ్రామపంచాయతీకి రూ.కోటి ఆదాయం ఉన్నప్పటికీ సచివాలయ భవనానికి మరమ్మతులు చేయించే విషయంలో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బూదవాడ సచివాలయానికి మరమ్మతులు చేపట్టి, భవనాన్ని వినయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.